ఒక్క గ్రామం.. రెండు మండలాలు

- పెద్దదేవులపల్లి గ్రామపంచాయతీ రెవెన్యూ పరిధి త్రిపురారం మండలంలో..
- పోలీస్ స్టేషన్ పరిధి మాత్రం మాడుగులపల్లి మండలంలో..
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

త్రిపురారం: పరిపాలనా సౌలభ్యం కోసం కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త జిల్లాలు, మండలాలను ఏర్పాటు చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాగా ఉన్నప్పుడు త్రిపురారం మండలంలో పెద్దదేవులపల్లి, పూసలపహాడ్, గజలాపురం, అభంగాపురం గ్రామాలు కొనసాగాయి. నూతన మండలాల ఏర్పాటులో భాగంగా పూసలపహాడ్, గజలాపురం, అభంగాపురం గ్రామాలను త్రిపురారం మండలం నుంచి వేరు చేసి కొత్తగా ఏర్పాటుచేసిన మాడుగులపల్లి మండలంలో కలిపారు. పెద్దదేవులపల్లి గ్రామపంచాయతీ మాత్రం త్రిపురారం మండలంలోనే కొనసాగుతుంది. అయితే పెద్దదేవుల పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన వీధి అయిన నర్సింహులగూడెంను మాత్రం మాడుగులపల్లి మండలంలో కలిపారు. ఇక్కడ నివసించేది పెద్దదేవులపల్లి గ్రామస్తులే. అంతేకాకుండా పెద్దదేవులపల్లి గ్రామం రెవెన్యూ పరంగా త్రిపురారం మండలంలో కొనసాగుతుంటే పోలీస్ స్టేషన్ పరిధి మాత్రం మాడుగులపల్లి మండలంలో కలిపారు. దీంతో పెద్దదేవులపల్లి గ్రామస్తులు రెవెన్యూ పనుల నిమిత్తం త్రిపురారం మండలానికి, పోలీస్ స్టేషన్ పనుల పరంగా మాడుగులపల్లి మండలానికి వెళ్లి పనులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై చలకుర్తి మాజీ ఎమ్మెల్యే దివంగత నేత గుండెబోయిన రాంమూర్తియాదవ్ కూడా సీఎం కేసీఆర్, రాష్ట్ర మంత్రులకు విన్నవించి సమస్య పరిష్కారానికి కృషిచేశారు.


పోలీస్ స్టేషన్ పరిధి మార్చాలని గ్రామస్తులు ఇచ్చిన వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న హోంమంత్రి (ఫైల్)

హోంమంత్రి హామీ ఇచ్చినప్పటికీ..

మాడుగులపల్లి మండలంలో కొనసాగుతున్న పోలీస్ స్టేషన్ పరిధిని త్రిపురారం మండలంలో కొనసాగించాలని నాగార్జునసాగర్ ఉప ఎన్నిక సమయంలో పెద్దదేవులపల్లి గ్రామంలో ప్రచారానికి వచ్చిన హోంమంత్రి మహమూద్ అలీకి గ్రామస్తులు విన్నవించారు. అందుకు ఆయన సానుకులంగా స్పందించి మారుస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు హోంమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే నోముల భగత్ ప్రత్యేక చొరవ తీసుకొని పోలీస్ స్టేషన్ పరిధి మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే చొరవ చూపాలి



గత ఉప ఎన్నిక సమయంలో పెద్దదేవులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిని మాడుగులపల్లి నుంచి తొలగించి త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో కలుపుతామని హామీ ఇచ్చారు. ఎన్నికలు అయిపోయిన తర్వాత ఆ హామీని పట్టించుకోలేదు. గ్రామస్తులు పోలీస్ స్టేషన్ పరంగా ఇబ్బందులు పడుతున్నారని ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికైనా ఎమ్మెల్యే భగత్ చొరవ తీసుకొని పోలీస్ స్టేషన్ పరిధిని మార్చాలి.

– టాకూర్ బాలరాణిబాయి, సర్పంచ్, పెద్దదేవులపల్లి

పోలీస్ స్టేషన్ పరిధి మార్చాలి



కొత్త మండలాలు ఏర్పాటులో భాగంగా పెద్దదేవులపల్లిని మాడుగులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కలిపారు. కానీ రెవెన్యూ పరంగా త్రిపురారం మండలంలో కొనసాగుతుంది. వివిధ పనుల నిమిత్తం గ్రామస్తులు ఎక్కువగా త్రిపురారం మండల కేంద్రానికి వెళ్తుంటారు. ఏదైనా కేసులకు సంబంధించి మాడుగులపల్లికి వెళ్లాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిని త్రిపురారం మండలానికి మార్చాలి.

– అంబటి రాము, ఎంపీటీసీ, పెద్దదేవులపల్లి

క్లుప్తంగా

'వందేభారత్'కు హాల్ట్ ఇవ్వాలని ఎంపీకి వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్: వందే భారత్ రైలును మిర్యాలగూడలో నిలిపే విధంగా కేంద్రాన్ని ఒప్పించాలని బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు దశరథ, యాదవ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి చేగొండి మురళీయాదవ్ కోరారు. ఈ మేరకు ఆదివారం మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చిన నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో పలు రైళ్ల ఆగేలా కృషి చేసిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. బీబీనగర్ నుంచి నడికుడి వరకు డబ్లింగ్ మంజూరు చేయించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాజన్న, అశోక్ తదితరులు ఉన్నారు.

దళిత ఉద్యమనేతకు సన్మానం

మిర్యాలగూడ టౌన్: రాష్ట్ర షెడ్యూల్ కులాల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దళిత ఉద్యమనేత డాక్టర్ జేబీ.రాజు జన్మదిన వేడుకలను ఆదివారం హైదరాబాద్‌లోని ఎస్వీఎం గ్రాండ్‌లో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా సెక్రటరీ గోల్లపూడి జైపాల్, కొత్తపల్లి బాబురావు, మిర్యాలగూడ సంఘం నేతలు సింగం శ్రీనివాస్, మాడుగుల శ్రీనివాస్ తదితరులున్నారు.

డాక్టర్ ఆనంద్ సేవలకు సత్కారం

మిర్యాలగూడ: మిర్యాలగూడకు చెందిన డాక్టర్ ఇస్లావత్ ఆనంద్‌కుమార్‌ను డాక్టర్స్‌డే సందర్భంగా ఆదివారం ఢిల్లీలో ఆ రాష్ట్ర మున్సిపల్ శాఖ డిప్యూటీ కమిషనర్ శశాంక అల ఘనంగా సన్మానించారు. 15 సంవత్సరాలుగా ఢిల్లీలో ఉంటూ తన తల్లి సుజాత పేరుతో బంజారా మహిళ ఎన్‌జీఓ సంస్థను స్థాపించి వేల మంది పేదవారికి ఆయుర్వేద వైద్య అందిస్తున్నందుకు తనను సన్మానించినట్టు డాక్టర్ ఆనంద్ పేర్కొన్నారు.

కలత చెంది.. గుంతను పూడ్చి


రోడ్డుపై ఏర్పడి గుంతల్లో హెచ్‌ఎం శ్రీరాంరెడ్డి పోయించిన మట్టి

గుర్రంపోడు: మండంలోని పిట్టలగూడెం గ్రామ స్టేజీ సమీపంలో నల్లగొండ–దేవరకొండ రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ గుంత కారణంగా రెండు రోజుల క్రితం ఓ ఉపాధ్యాయుడు బైక్‌పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. అయినా గుంతను పూడ్చిన నాథులే లేకుండా పోయారు. రోజు ఇదే రోడ్డు మీదుగా వెళ్తున్న పిట్టలగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరెడ్డి శ్రీరాంరెడ్డి ఇదే గుంత వద్ద తన కళ్లముందే బైక్‌పై వెళ్తున్న ఓ దంపతులు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. ఇది చూసి కలత చెంది చెలించిపోయని శ్రీరాంరెడ్డి ఆదివారం ట్రాక్టర్ మట్టి తెప్పించి రోడ్డుపై గుంతలో పోయించి పూడ్చించి తన బాధ్యతను చాటుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎక్సైజ్ సీఐ

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ ఎక్సైజ్ సీఐగా ఎల్.మహేశ్వర్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఉప్పల్‌లో ఎక్సైజ్ స్టేషన్‌లో ఎస్‌గా విధులు నిర్వహిస్తూ ప్రమోషన్‌పై సీఐగా మిర్యాలగూడకు బదిలీపై వచ్చారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన మహేశ్వర్‌రెడ్డికి ఎక్సైజ్ ఎస్‌ఐలు రామకృష్ణ, పర్విన్, లావణ్యలు పుష్ప గుచ్ఛం అందిచేసి సాదరంగా స్వాగతం పలికారు.

కలెక్టరేట్ ముట్టడి కరపత్రం విడుదల

అడవిదేవులపల్లి: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం చేపట్టే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన కరపత్రాన్ని ఆదివారం అడవిదేవులపల్లిలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల సహాయ కార్యదర్శి కుర్ర సైదానాయక్, నాయకులు శివ, హనుమంతు, మంగ్యా, బిందు, రాంబాబు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన వలసాని నాగరాజు ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి నిడమనూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, త్రిపురారం సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డిలు చెరో రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. వారి వెంట బీఆర్ఎస్ మండల మైనార్టీ అధ్యక్షుడు షేక్ దస్తగిరి, షేక్ బురాన్, పీబీ రవి ఉన్నారు.

రాబోయే ఎన్నికల్లో మళ్లీ బీఆర్‌ఎస్‌దే విజయం

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్‌దే విజయమని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆశా భావం వ్యక్తం చేశారు. ఆదివారం దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చందంపేట మండలం పాత తెల్దేవర్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమం లో నాయకులు ముత్యాల సర్వయ్య, సయ్యద్, మోహన్‌కృష్ణ, బొడ్డు గోపాల్ గౌడ్, అర్జున్, రవి తదితరులున్నారు.


పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం


అలీనగర్ వద్ద పైపు లైన్ పనులు ప్రారంభిస్తున్న ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి

హాలియా : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాదం సంపత్‌కుమార్ అన్నారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్ రెండో వార్డులో ఎమ్మెల్యే నోముల భగత్ ద్వారా మంజూరైన సీడీపీ నిధులు రూ. 2లక్షలతో చేపట్టనున్న తాగునీటి నూతన పైపు లైన్ పనులకు ఆదివారం వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. అలీనగర్ ప్రాంతం నుంచి కోదాడ–జడ్చర్ల, నకిరేకల్– నాగార్జున సాగర్ వరకు చేపట్టిన జాతీయ రహదారి పనుల్లో తాగునీరు అందించే పైపులైన్లు ధ్వంసం అయ్యాయని తెలిపారు. దీంతో ప్రజలకు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే నోముల భగత్ దృష్టికి తెసుకెళ్లగా సీడీపీ నిధులు రూ.2లక్షలు మంజూరు చేయించారన్నారు. ఈ నిధులతో తాగునీటి పైపులైన్ పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ యడవెల్లి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, కోఆప్షన్ సభ్యుడు చాపల సైదులు, మాజీ డెరెక్టర్ అక్బర్‌ఖాన్, మాజీ సర్పంచ్ ఆవుల సైదులు, నాదేండ్ల వెంకటేశ్వర్లు, మోసినలి, మహమూద్ అలీ, అన్వర్‌ఖాన్, అంజద్‌ఖాన్, పిట్టల శ్రీను, యాకూబ్, కొండల్, హబీబ్, మహబూబ్ అలీ, హజి, సర్వర్, మధు, జావీద్‌ఖాన్ ఉన్నారు.

సాయిబాబా మందిరం ముస్తాబు


హాలియాలో గురుపౌర్ణమి ఉత్సవాలకు ముస్తాబైన షిర్డీసాయి మందిరం

హాలియా: గురుపౌర్ణమి వేడుకలకు పట్టణంలోని షిర్డీ సాయి మందిరం ముస్తాబు చేశారు. షిర్డీ సాయి సేవా సమితి హాలియా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తేలప్రోలు శేఖర్, ప్రధాన కార్యదర్శి బానోతు సక్రునాయక్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్ది చలువ పందిళ్లు ఏర్పాటు చేశామని, ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లుపూర్తి చేశామన్నారు. గురుపౌర్ణమి నాడు ఆలయ ప్రధాన అర్చకుడు మనోజ్ పాండేయ్ ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం కాకర హారతి, బాబాకు 108 కలశాలతో కలాశాభిషేకం, పుష్పార్చన, సంస్థాన్ హారతి, ధునిపూజ, సామూహిక సాయి సచ్చరిత పారాయణం, సామూహిక విష్ణు సహస్రనామస్తోత్ర పారాయణము అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించున్నట్లు తెలిపారు. సాయంత్రం హాలియా పురవీధుల్లో షిర్డీ సాయినాథుని శోభాయాత్ర, పల్లకీసేవ ఉంటుందన్నారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయల కమిటీ కోశాధికారి మిట్టపల్లి శివకుమార్, ఆలయ ధర్మకర్త మిట్టపల్లి సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

నేడు సాయి మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు

చింతపల్లి : చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి దేవాలయం సోమవారం గురుపౌర్ణమి వేడుకలకు సిద్ధమైంది. సాయినాథుడిని దర్శించుకునేందుకు నల్లగొండ జిల్లా నుంచే కాకుండా మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక పూజా, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

విద్యతోనే దేశం అభివృద్ధి


మాట్లాడుతున్న పల్‌రెడ్డి శాంతిపాల్‌రెడ్డి

హాలియా : దేశంలో విద్య అభివృద్ధి చెందినప్పుడే పలు రంగాల్లో దేశాభివృద్ధి జరుగుతుందని పల్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పల్‌రెడ్డి శాంతిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో పల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొదటి వార్షికోత్సవ సందర్భంగా పాల్‌టెక్ సాఫ్ట్‌వేర్ కంపెనీ భాగస్వామ్యంతో నిర్వహించిన నియోజకవర్గంలోని అనుముల, తిరుమలగిరి(సాగర్), పెద్దవూర, నిడమనూరు మండలాలకు చెందిన నూతన అభ్యాసికుల సమావేశంలో ఆమె హాజరై మాట్లాడారు. విద్యాభివృద్ధి కోసం పలు మండలాల్లో బోధకులను ఏర్పాటు చేసి పేద పిల్లల కోసం రాత్రి బడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఉన్న పేద పిల్లలకు ఉచిత విద్యను అందించి వారి బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్లు యాదగిరిరెడ్డి, నరసింహారెడ్డి, వివిధ మండలాల కోఆర్డినేటర్లు రమేష్‌రెడ్డి, శేఖర్, రిజ్వాన్‌బాబా, అంజయ్య ఉన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

మిర్యాలగూడ టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఆస్పత్రులు, హాస్టళ్లు, పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లలో రజక వృత్తికి అవకాశం ఇవ్వాలని జీఓ తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి రజక సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర నేత, బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు బాసాని గిరి, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు ఎర్రబెల్లి దుర్గయ్య, నాయకులు ఎస్. యాదగిరి, కుమ్మరికుంట్ల సుధాకర్, బండిరాజుల యల్లయ్య, తుకారం, పెంటయ్య, బాలకృష్ణ, సైదులు, లక్ష్మినారాయణ, బాసాని మల్లేష్, రాము, ఉమామహేశ్వర్‌రావు, అక్కెన పల్లి పిచ్చయ్య, శ్రీనివాస్, సైదులు, రాములు, లక్ష్మయ్య, నాగయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.

జిల్లాగా ప్రకటించాలి

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం కోరారు. ఈ మేరకు ఆదివారం సాగర్ రోడ్డులోని రైతు బజారు వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్నీ వసతులు కలిగి ఉన్న మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించేలా ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని వేడుకున్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం నాయకులు నక్క నాగరాజు, అశోక్, రంగా, శ్యామ్ ఉన్నారు.


వెంకట్రాహుల్‌ను పరామర్శించిన నేతలు

నిడమనూరు : మండల కేంద్రానికి చెందిన మేరెడ్డి వెంకట్రాహుల్‌ను సీఎల్‌పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ సీడీ రవికుమార్ ఆదివారం పరామర్శించారు. కాంగ్రెస్ నాయకుడు మేరెడ్డి వెంకట్రాహుల్ మాతృమూర్తి మేరెడ్డి ఛాయాదేవి (85) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆదివారం వారు వెంకట్రాహుల్ నివాసంలో ఛాయాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట మేరెడ్డి వెంకట్రాహుల్, కుందూరు లక్ష్మారెడ్డి, మేరెడ్డి వివేక్, తుకారాం, కోలా శ్యాం, అజ్మత్ తదితరులున్నారు.

పచ్చదనం ప్రతిఒక్కరి బాధ్యత

మిర్యాలగూడ టౌన్: మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మిర్యాలగూడ 5వ అదనపు జిల్లా న్యాయమూర్తి కె.కవిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.స్వర్ణలత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీఎస్ఎన్ సుమబాల అన్నారు. ఆదివారం స్థానిక కోర్టు అవరణలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో హరిత హారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కంభం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీనివాస్, న్యాయవాదులు, న్యాయ సేవా సంస్థ సభ్యులు కొంక వెంకన్న, మేక కుమార్‌రెడ్డితో పాటు కోర్టు సిబ్బంది, న్యాయవాదులు తదితరులున్నారు.

ప్రజలతో మమేకం కావడానికే టోర్నమెంట్


మొదటి బహుమతి అందుకుంటున్న ఎస్‌పీఎఫ్ సిబ్బంది

నాగార్జునసాగర్: ప్రజలతో మమేకం కావడం కోసం కమ్యూనిటీలో భాగంగా విజయపురి టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని నాగార్జునసాగర్ సీఐ బీసన్న తెలిపారు. ఆదివారం హైలాన్‌కాలనీ కృష్ణాక్లబ్‌లో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కర్ణఅనూషాశరత్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బిన్ని, కౌన్సిలర్లు, ఎస్‌ఐ సురేష్‌లతో కలిసి సీఐ వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. 11టీంలు పాల్గొని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆడారు. మొదటి బహుమతి స్థానిక ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం భద్రత సిబ్బందికి రాగా ద్వితీయ బహుమతి కృష్ణాక్లబ్‌కు దక్కింది. టోర్నమెంటులో పాల్గొన్న అన్నిటీంలకు వాలీబాల్ కిట్లు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

తెలంగాణలో బీజేపీకి అధికారం ఖాయం


మిర్యాలగూడ టౌన్ : ఇంటింటికీ బీజేపీలో పాల్గొన్న గురునాథరెడ్డి, వాసుదేవ్ తదితరులు


దేవరకొండ: మాట్లాడుతున్న సౌమ్య తిప్పేస్వామి

మిర్యాలగూడ టౌన్: తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కర్నాటక రాష్ట్రానికి చెందిన స్వల్పకాలిక విస్తారకులు గురునాథరెడ్డి, వాసుదేవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బాణావత్ రతన్‌సింగ్ నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని గాంధీనగర్‌లో చేపట్టిన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తుంటే ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. తెలంగాణలో కుటుంబ పాలనను అంతమొందించాలన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే తెలంగాణ బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, పట్టణ శక్తి కేంద్రాల ఇన్‌చార్జి పాతకోటి సైదులు, దైద సోములు, శ్రీను, నాగరాజు తదితరులు ఉన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

దేవరకొండ: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఆ పార్టీ కర్ణాటక విస్తారక్ సౌమ్య తిప్పేస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని 76,84,85 బూత్‌లలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో ప్రధాని నరేంద్రమోది నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ఇంటింటికి వివరించాలని ఆమె కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, గాజుల మురళి,గుండాల అంజయ్య, జల్దా భాస్కర్, సముద్రాల సహదేవ్, ఛండీశ్వర్, చిలకరాజు శ్రీను, గాజుల వినయ్, పున్న వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై బీజేపీ ఇంటింటి ప్రచారం

చింతపల్లి : మండల పరిధిలోని గొడుకొండ్ల గ్రామంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ స్వల్పకాలిక్ విస్తారక్ రఘురాం మాట్లాడారు. బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో బీజేపీ సంక్షేమ పథకాలను ఇంటింటికి చేరవేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు శివర్ల రమేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ కాసోజు బ్రహ్మచారి, తిరుపతి, పర్వతాలు, గోవర్ధన్, సుమన్‌నాయక్, బాలరాజు, గోవిందు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కొండమల్లేపల్లి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బూత్ స్థాయిలో ప్రజలకు వివరించాలని స్వల్పకాలిక్ విస్తారక్ రాజేశ్ బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనా కాలంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఆదివారం బూత్ స్థాయిల వారిగా ప్రజలకు వివరించారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడు బొడిగె సాంబశివ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పేర్ల జితేందర్, నెల్లికంటి గోపి, నేతాళ్ల భరత్, పస్నూరి నాగాచారి, భూతరాజు నాగరాజు, కార్తీక్, చందు, మధు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వారీష్

పెద్దవూర : మండలంలోని పొట్టివానితండా, నాయనివానికుంటతండాలలో ఆదివారం ఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఓమిని ఆస్పత్రి డాక్టర్ వారీష్ టీంచే సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. గుండెపోటుకు గురైన సమయంలో సీపీఆర్ ప్రథమ చికిత్స ద్వారా ప్రాణాలను ఎలా కాపాడుకోవచ్చు అనే దానిపై థెరపిస్టులు అన్నెపాక రవికుమార్, కట్టెబోయిన విశాల్‌లు మెళకువలు నేర్పించి ప్రజలచే తిరిగి సీపీఆర్ చేయించారు. ఈ సందర్భంగా ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం చిన్నా, పెద్ద తేడా లేకుండా చాలామంది గుండెపోటుకు గురై అకాలమరణం చెందుతున్నారని, సీపీఆర్ చేయడం ద్వారా మనిషి ప్రాణాలు కాపాడుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు బాలునాయక్, శర్మన్, వినోద్‌నాయక్, గ్రామస్తులు రమావత్ నరేష్‌నాయక్, ఫౌండేషన్ సభ్యులు మన్నెం కోటి, శివ, అనిల్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పెద్దవూర: తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీ వేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సోమవారం చేపట్టిన చలో కమిషనరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్టీ హాస్టల్ వర్కర్ల సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్తీ రామునాయక్, నాగేందర్ కోరారు. ఆదివారం పెద్దవూర మండల కేంద్రంలో నిర్వహించిన వర్కర్ల మండల సమావేశంలో వారు మాట్లాడారు. డైలీ వేజ్ వర్కర్లను ఔట్‌సోర్సింగ్‌కి మార్చాలనే ఆలోచన విరమించుకోవాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, ఐదేళ్ల సర్వీసున్నవారిని పర్మినెంట్ చేయాలన్నారు. సమావేశంలో సాంబయ్య, రాములమ్మ, విమల, షరీఫా, చిన్ని ఉన్నారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ: భూమి ఆక్రమణ విషయంలో ఫిర్యాదు చేసిన తనపై అమర్యాదగా మాట్లాడిన నిడమనూరు ఎస్‌ఐ శోభన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన దిద్దకుంట్ల శంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మిర్యాలగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిడమనూరు మండలం ముప్పారం గ్రామంలో తనకున్న 20 ఎకరాల వ్యవసాయ భూమిలో 15గుంటల ఆక్రమణకు గురైందన్నారు. ఈ విషయమై సర్వే రిపోర్ట్ ఆధారంగా తన హద్దు రాళ్లు తొలగించి చీదళ్ల నర్సయ్య తదితరులపై గత నెల 19న నిడమనూరు ఎస్‌ఐకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇదే విషయమై ఎస్‌ఐను కలిసేందుకు వెళ్లగా బూతులు తిట్టి పొలంలోకి వెళ్తే కాళ్లు విరగొడ్తానని బెదిరించినట్లు ఆరోపించారు. ఇదే విషయాన్ని ఎస్పీ, ఏడీజీ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అంతేకాకుండా కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ కాపీ ఇచ్చిన రెండ రోజులకు జూన్ 30న తన ప్రమేయం లేకుండా కేసు రాజీ కుదుర్చుకున్నట్లు తన సెల్‌కు మెసేజ్ పంపినట్లు వాపోయారు. సర్వే రిపోర్ట్ ప్రకారం తన భూమికి హద్దులు ఏర్పాటు చేసి న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

డిండి: ఈనెల 20న ప్రారంభమయ్యే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ఎల్లేష్ డిమాండ్ చేశారు. ఈనెల 7న దేవరకొండలో హలో మాదిగ– చలో దేవరకొండ నియోజకవర్గ సదస్సు కరపత్రాన్ని ఆదివారం డిండిలో ఆ సంఘం నాయకులతో కలిసి ఆయన విడుదల చేసి మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే సదస్సను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు మంద సైదులు, డిండి పట్టణ అధ్యక్షుడు బూషిపాక బాలయ్య, శివ, విజయ, లక్ష్మయ్య, రాజు, చిన్న పాల్గొన్నారు.

వేలిముద్ర ద్వారానే డీలర్లకు రేషన్ బియ్యం


ఈ పాస్‌ను ప్రారంభిస్తున్న హైమద్‌ఖాన్

మిర్యాలగూడ టౌన్: ప్రతి డీలర్ మండల లెవెల్ స్టాక్(ఎంఎల్ఎస్) పాయింట్ వద్ద తప్పనిసరిగా వేలిముద్ర వేస్తేనే రేషన్ షాపులకు బియ్యం సరఫరా అవుతాయని రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు హైమద్‌ఖాన్, డివిజన్ అధ్యక్షుడు పగిలి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని ఐఎంజీ పాయింట్ వద్ద ఆదివారం ఈ పాస్ యంత్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. గతంలో 50 కేజీల బస్తాకు తరుగు పోయేదని, ఇప్పటి నుంచి 50 కేజీలు ఉంటేనే వేలిముద్ర ద్వారా తీసుకోవడం జరుగుతుందన్నారు. ఐఎంజీ పాయింట్ వద్ద ఈ పాస్ యంత్రం ఏర్పాటుకు సహకరించిన జిల్లా డీఎస్‌ఓ, అదనపు కలెక్టర్, మిర్యాలగూడ ఎంఎల్ఎస్ పాయింట్ అధికారి సుధాకర్‌కు పలువురు డీలర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖమ్మం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


మిర్యాలగూడ : బీఎల్ఆర్ ఆధ్వర్యంలో ఖమ్మం సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు


అడవిదేవులపల్లి నుంచి బయలుదేరుతున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ, అడవిదేవులపల్లి, కొండమల్లేపల్లి, సాగర్‌తిరుమలగిరి, డిండి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ముఖ్య అతిథిగా ఖమ్మంలో ఆదివారం జరిగిన తెలంగాణ జన గర్జన సభకు ఆ పార్టీ మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, సాగర్ తిరుమలగిరి మండలాల నుంచి ఆ పార్టీ శ్రేణులు వివిధ వాహనాల్లో భారీగా తరలి వెళ్లాయి. మిర్యాలగూడ నుంచి మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్, ఆ పార్టీ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు చిలుకూరి బాలు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు. అడవిదేవులపల్లి నుంచి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రమావత్ బాలునాయక్, బండి నాగేశ్వర్‌రావు, హనుమంతు, లాలు, సతీష్, జనార్దన్, నారాయణ, మల్లిఖార్జున్, తిరుమలగిరి నంచి యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మేరావత్ ముని నాయక్, శౌరినాయక్, భిక్షాలు, ముని, నాగేందర్. దేవుజ, సాయి నాయుడు ఉన్నారు. డిండి నుంచి ఎస్ఎఫ్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి పున్న దినేష్, మల్లేష్, వెంకటేష్, లక్ష్మణ్, పీర్‌మహ్మద్, రాజేందర్‌రెడ్డి తదితరులున్నారు. కొండమల్లేపల్లి మండలం నుంచి తరలిన వారిలో ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి, చెన్నారం ఎంపీటీసీ రమావత్ జగన్‌నాయక్, మిద్దె యాదయ్య, శ్రీనివాస్, బద్యానాయక్, రమేశ్ నాయక్, తుకారాం, విఠల్ ఉన్నారు.